# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో సంపూర్ణ ఆరోగ్యవ్యవస్థ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.
- ❖ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడం పట్ల మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు.
- ❖ రాష్ట్రంలో రైల్వే స్టేషన్ల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించామని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.
- ❖ విశాఖలో జరగనున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ, మిలాన్-2026 ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఈరోజు సమావేశం నిర్వహించారు.

=======================

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్రంలో సమర్థవంతమైన, సంపూర్ణమైన ఆరోగ్య వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విజయనగరం జిల్లా ఎస్.కోట ఏరియా ఆసుపత్రి నూతన భవనాన్ని, రాహి హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 5 పడకల డయాలసిస్ కేంద్రాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు. అదే విధంగా.. శ్రీకాకుళం జిల్లా సీతంపేట డయాలసిస్ కేంద్రాన్ని కూడా ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రతీ కుటుంబానికి 25 లక్షల రూపాయల విలువైన వైద్య బీమా సౌకర్యం కల్పించేందుకు ముఖ్యమంత్రి రూపకల్పన చేశారని చెప్పారు. కిడ్నీ రోగులను ఆదుకొనేందుకు ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తోందని, రాష్ట్ర వ్యాప్తంగా వారి కోసం 65 కేంద్రాలలో ప్రధానమంత్రి జాతీయ డయాలసిస్ కార్యక్రమం కింద వీటిని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు, సిబ్బందిని, వైద్యుల సంఖ్యను పెంచామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు.

=======================

కేంద్ర బడ్జెట్‌లో పర్యాటకం, ఆతిథ్యం, సంస్కృతికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం పట్ల రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో పర్యాటక రంగానికి 2 వేల 438 కోట్ల రూపాయలు, సాంస్కృతిక శాఖకు 3 వేల 416 కోట్ల రూపాయలు కేటాయించారని, రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాల పర్యాటక ప్రాజెక్టులు నెలకొల్పేందుకు ఈ నిధులు వీలు కల్పిస్తాయని పేర్కొన్నారు. వీటి ద్వారా పర్యాటకుల రాక పెరుగుతుందని, సందర్శకులకు మరింత గొప్ప అనుభవాలు కలుగుతాయని వివరించారు. భవిష్యత్ తరాలకు ఆధ్యాత్మిక, చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని డిజిటలైజ్ చేయడం, సంరక్షించడం వంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. అధిక సంఖ్యలో పర్యాటకులను ఆకర్షించేందుకు బౌద్ధ సర్క్యూట్‌లకు, చారిత్రక కట్టడాలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని చెప్పారు. 10 వేల మంది టూర్ గైడ్‌లకు శిక్షణ ఇవ్వడం, సేవా నాణ్యతను మెరుగుపరచడం వంటి ప్రణాళికలు కూడా బడ్జెట్‌లో ఉన్నాయన్నారు. భారతదేశాన్ని మూడవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్న ఈ బడ్జెట్ చారిత్రాత్మకమైనదిగా మంత్రి కందుల దుర్గేష్ అభివర్ణించారు.

========================

రాష్ట్రంలో రైల్వే స్టేషన్ల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించామని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ రోజు ఆయన వర్చువల్ గా నిర్వహించిన మీడియా సమావేశంలో విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో రైల్వే స్టేషన్ల అభివృద్ధికి 10 వేల 134 కోట్ల రూపాయలు కేటాయించామని, ఆధునిక సాంకేతికత సహాయంతో రైల్వే అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. అనంతరం విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ (DRM) మోహిత్ సోనాకియ మీడియాతో మాట్లాడుతూ.. విజయవాడ డివిజన్ లో ఇప్పటికే అనేక రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని చెప్పారు. అన్ని రైల్వే స్టేషన్ల పరిధిలోను విద్యుదీకరణ నూరు శాతం పూర్తయిందని ఆయన వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

========================

ఈ నెల 18, 19వ తేదీల్లో విశాఖలో జరగనున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (IFR), మిలాన్ -2026 కార్యక్రమాల ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఈరోజు సచివాలయంలో సమావేశం నిర్వహించారు. వైస్ అడ్మిరల్ సుశీల్ మీనన్, చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఈస్టర్న్ నావెల్ కమాండ్.. ఇతర నౌకాదళ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీ ఎస్ విజయానంద్ మాట్లాడుతూ... ఫ్లీట్ రివ్యూకు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హజరవుతారని, మిలాన్‌కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తో పాటు ఇతర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. ఈ రెండు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని నౌకాదళ అధికారులకు చెప్పారు. ఇందుకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులకు సిఎస్ ఆదేశాలు జారీ చేశారు.

విరామం

========================

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) సెంటర్ ను కర్నూలు నగరంలోనే కొనసాగించాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మండవీయాను కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు కోరారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలో పాల్గొంటున్న ఆయన, కేంద్ర మంత్రిని ఈరోజు కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. కర్నూలు నగరంలో ఉన్న శాయ్ సెంటర్‌ను తరలించే ప్రతిపాదనను పునఃపరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. శిక్షణ సౌకర్యాలను అందించడం ద్వారా యువతలో క్రీడా ప్రతిభను పెంపొందించడంలో ఈ సెంటర్ ముఖ్యమైన పాత్ర పోషిస్తోందని, అలాగే.. కర్నూలుతో పాటు సమీప జిల్లాల అథ్లెట్లకు ఒక కీలక సహాయక వ్యవస్థగా ఉంటోందని చెప్పారు.

========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 7వ తేదీన కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారని స్థానిక శాసనసభ్యులు బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. రైతులకు మేలు జరిగేలా కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను ప్రభుత్వం రూపొందించిందని, ఈ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి వాటిని రైతులకు అందజేస్తారని చెప్పారు. కొత్త పాస్ బుక్‌లో భూ వివరాలతో పాటు యజమాని పేరు మొదలైనవి డిజిటల్ గా ఉంటాయని, క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేయడం ద్వారా అన్ని వివరాలను తెలుసుకోవచ్చని చెప్పారు. ప్రజలంతా ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

=======================

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) పనితీరు పట్ల విశ్వసనీయత పెరిగేలా అధికారులు బాధ్యతయుతంగా పని చేయాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. అమలాపురం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని సంయుక్త కలెక్టర్ నిషాంతితో కలసి ప్రజలు నుండి సుమారు 300 అర్జీలను స్వీకరించారు. ప్రజల నుండి వచ్చిన ప్రతి అర్జీపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సేవలతో పాటు ఇళ్ల స్థలాలు, ఇళ్ల మంజూరు, ఉపాధి, పెన్షన్ మంజూరు తదితర అంశాలకు సంబంధించి అర్జీలు అందాయని కలెక్టర్ తెలిపారు.

=======================

ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త అనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షను సాకారం చేసేందుకు రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్) అడుగులు వేస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. కలెక్టరేట్‌లో ఈరోజు ఏర్పాటు చేసిన ఇగ్నైట్ సెల్‌లో ఆర్‌టీఐహెచ్ ఆధ్వర్యంలో 3 అంకుర సంస్థలు, 2 ఎంఎస్ఎంఈలు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. సింటాక్స్ లెన్స్, ఈటీ ఆర్గానిక్స్ తదితర సంస్థల ఉత్పత్తులను కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించి.. పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. అనంతరం మాట్లాడుతూ... రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్.. స్టార్టప్ సంస్థలకు గొప్ప ప్రోత్సాహమిస్తోందన్నారు. ఎనికేపాడులోని ఆర్‌టీఐహెచ్ స్పోక్ ద్వారా స్టార్టప్ లను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విద్యా సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటూ.. యువతను పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా తెలియజేశారు.

=======================

మీ భూమి – మీ హక్కు కార్యక్రమం ద్వారా రాజముద్రతో ముద్రించిన 77 వేల 500 పట్టాదార్ పాస్ పుస్తకాలను ఏలూరు జిల్లాలో రైతులకు అందించామని కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. లింగపాలెం మండలం గణపావారిగూడెం గ్రామంలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తో కలిసి ఆమె ఈరోజు రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రీ సర్వే అనంతరం సవరించిన భూ వివరాలు, QR కోడ్, రాజముద్రతో ముద్రించిన పట్టాదార్ పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తున్నామన్నారు. ఈ కొత్త పాస్ పుస్తకాల ద్వారా రైతులకు వారి భూమిపై స్పష్టమైన హక్కులు కల్పిస్తున్నామని, QR కోడ్‌ను స్కాన్ చేయగానే సర్వే నంబర్లు, విస్తీర్ణం, పట్టాదారు పేరు తదితర వివరాలు కనిపిస్తాయని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మీ భూమి – మీ హక్కు రెండవ విడతలో నేటి నుండి 9వ తేదీ వరకు ఎంపిక చేసిన గ్రామాలలో కొత్త పాస్ పుస్తకాల పంపిణీ జరుగుతుందని వెల్లడించారు.

=======================

ఎన్టీఆర్ జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ పిలుపునిచ్చారు. వాసవ్య మహిళా మండలి (వీఎంఎం) - బాల్య వివాహ విముక్తి రథాన్ని ఆయన కలెక్టరేట్‌లో ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ ప్రచార రథం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బాల్య వివాహాల చట్టాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

========================

========================